రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:29 (ఆదివారం సాయంత్రం) | సహర్ 4:58 (సోమవారం ఉదయం)



బుగ్గారం మండలం వెల్గొండలో నేలవాలిన మొక్కజొన్న



చల్‌గల్‌లో నేల రాలిన మామిడి కాయలు

అకాల వర్షం అపార నష్టం

- జగిత్యాల, బుగ్గారం మండలాల్లో వడగండ్ల వాన
- వరి, మామిడి, మొక్కజొన్న, నువ్వు పంటలకు నష్టం
- జిల్లాలో 5,532 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో కూడిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన పడి వరి గింజలు రాలిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన వడ్లు, పసుపు పంట తడిచిపోయాయి. మామిడికాయలు రాలిపోయాయి. పంటలు దెబ్బతినడం వల్ల రైతన్నలు కన్నీరుమున్నీరవుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు శనివారం క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. కలెక్టర్ సత్యప్రసాద్ జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్, ధర్మపురి తదితర ప్రాంతాల్లో పర్యటించి వర్షం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించారు. జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో గుబులు పట్టుకుంది. వర్షాల భయానికి రైతులు ముందస్తు వరి కోతలకు వెళ్తున్నారు. మరో రెండు, మూడు రోజుల వర్ష సూచన ఉన్నట్లయితే వందల ఎకరాల్లో వరి పైర్లను కోసే అవకాశాలున్నట్లు అన్నదాతలు అంటున్నారు.

ఆరు పెంకుటిళ్లు నేలమట్టం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షం వల్ల 2,685 మంది రైతులు 5,532 ఎకరాల్లో వివిధ పంటలను రైతులు నష్టపోయారు. ఇందులో 549 మంది రైతులకు చెందిన 2,156 ఎకరాల మామిడి పంట నష్టానికి గురైంది. జిల్లాలోని పలు గ్రామాల్లో 2,138 మంది రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, నువ్వు పంట 3,376 ఎకరాల్లో దెబ్బతింది. ఇందులో 1,071 మంది రైతులకు చెందిన 1,836 ఎకరాల వరి, 1,037 మంది రైతులకు చెందిన 1,507 ఎకరాల మొక్కజొన్న, 30 మంది రైతులకు చెందిన 33 ఎకరాల నువ్వు పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి గ్రామంలో వర్షం వల్ల 6 పెంకుటిళ్లు నేల మట్టమయ్యాయి.

43 గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు

జిల్లాలోని పది మండలాల్లోని 43 గ్రామాల్లో అకాల వర్షానికి 5,532 ఎకరాల్లో వివిధ పంటలు నష్టానికి గురయ్యాయి. గొల్లపల్లి మండలంలోని 11 గ్రామాల్లో 365 మంది రైతులకు చెందిన 220 ఎకరాల వివిధ పంటలు దెబ్బతింది. ఇందులో 75 మంది రైతులకు చెందిన 36 ఎకరాల్లో వరి, 260 మంది రైతులకు చెందిన 160 ఎకరాల్లో మొక్కజొన్న, 30 మంది రైతులకు చెందిన 24 ఎకరాల్లో నువ్వు పంట దెబ్బతింది. జగిత్యాల రూరల్ మండలంలోని 8 గ్రామాల్లో 735 మంది రైతులకు చెందిన 513 ఎకరాల వరి పంట నష్టానికి గురయింది.

బీర్‌పూర్ మండలంలోని ఒక్క గ్రామంలో 8 మంది రైతులకు చెందిన 7 ఎకరాల పంటలు దెబ్బతినగా ఇందులో ఇరువురు రైతులకు చెందిన రెండు ఎకరాల వరి, ఆరుగురు రైతులకు చెందిన అయిదు ఎకరాల మొక్క జొన్న దెబ్బతింది. వెల్గటూరు మండలంలోని 3 గ్రామాల్లో 270 మంది రైతులకు చెందిన 162 ఎకరాల వివిధ పంటలు దెబ్బతినగా, ఇందులో 260 మంది రైతులకు చెందిన 157 ఎకరాల్లో వరి, 10 మంది రైతులకు చెందిన 5 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది. మేడిపల్లి మండలంలోని 3 గ్రామాల్లో ఐదుగురు రైతులకు చెందిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట నష్టానికి గురైంది. ఎండపల్లి మండలంలోని 6 గ్రామాల్లో 137 మంది రైతులకు చెందిన 123 ఎకరాల వివిధ పంటలు దెబ్బతినగా, ఇందులో 23 మంది రైతులకు చెందిన 39 ఎకరాల్లో వరి, 100 మంది రైతులకు చెందిన 98 ఎకరాల్లో మొక్కజొన్న నేలవాలింది.

బుగ్గారం మండలంలో 168 ఎకరాల్లో నష్టం

బుగ్గారం మండలంలోని 4 గ్రామాల్లో 257 మంది రైతులకు చెందిన 168 ఎకరాల వివిధ పంటలు దెబ్బతినగా, ఇందులో 10 మంది రైతులకు చెందిన 4 ఎకరాల్లో వరి, 247 మంది రైతులకు చెందిన 164 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బ తింది. పెగడపల్లి మండలంలోని 4 గ్రామాల్లో 100 మంది రైతులకు చెందిన 81 ఎకరాల వివిధ పంటలు దెబ్బతినగా, ఇందులో 12 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో వరి, 85 మంది రైతులకు చెందిన 55 ఎకరాల్లో మొక్కజొన్న, ముగ్గురు రైతులకు చెందిన 6 ఎకరాల్లో నువ్వు పంట దెబ్బతింది. సారంగపూర్ మండలంలోని ఒక్క గ్రామంలో 11 మంది రైతులకు చెందిన 18 ఎకరాల వివిధ పంటలు దెబ్బతినగా, ఇందులో నలుగురు రైతులకు చెందిన మూడు ఎకరాల్లో వరి, 14 మంది రైతులకు చెందిన 8 ఎకరాల్లో మొక్కజొన్న నష్టానికి గురయింది. ధర్మపురి మండలంలోని రెండు 835 మంది రైతులకు చెందిన 1,495 ఎకరాల వివిధ పంటలు దెబ్బతినగా, ఇందులో 810 మంది రైతులకు చెందిన 1,450 ఎకరాల్లో వరి, 45 మంది రైతులకు చెందిన 25 ఎకరాల్లో మొక్కజొన్న నష్టానికి గురయింది.

జిల్లాలో వర్షపాతం ఇలా..

జిల్లాలో శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి శనివారం ఉదయం 7 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెగడపల్లి మండలంలో అత్యధికంగా 47.3 మిల్లీమీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా ఇబ్రహీంపట్నం మండలం గోదూరులో 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బుగ్గారం మండలం సిరికొండలో 39.3, ఎండపల్లి మండలం గుల్లకోటలో 38.3, జగిత్యాల రూరల్ మండలం పొలాసాలో 35.0, గొల్లపల్లిలో 33.3, వెల్గటూరు, ధర్మపురి మండలం నేరేళ్లలో 32.8 , కొడిమ్యాల మండలం పూడూరులో 24.3, మల్యాలలో 23.0 ఎంఎం వర్షం పడింది. మల్యాల మండలం మద్దుట్లలో 20.3 , రాయికల్ మండలం అల్లీ పూర్‌లో 17.5 ఎంఎం, బీమారం మండలం గోవిందారంలో 13.8 ఎంఎం, జగిత్యాలలో 12.0 ఎంఎం, కథలాపూర్‌లో 8.3 ఎంఎం, మేడిపల్లిలో 7.0 ఎంఎం, సారంగపూర్‌లో 5.3 ఎంఎం, మల్లాపూర్, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 4.3 ఎంఎం, బీర్‌పూర్ మండలం కొల్వాయిలో 1.8 ఎంఎం, కోరుట్లలో 0.8 ఎంఎం వర్షం కురిసింది.





చల్‌గల్‌లో ఆరబెట్టిన మొక్కజొన్న



రాయపట్నంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

కథలాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. కథలాపూర్ మండలంలోని సిరికొండలో శనివారం అడిషనల్ కలెక్టర్ ఇంటి పన్నుల వసూళ్లు, ఎల్‌ఆర్‌ఎస్ స్కీం అమలు తీరును పర్యవే క్షించారు. ఇంటి పన్నులు వందశాతం వసూలయ్యేలా సిబ్బంది వేగ వంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఈనెల 31లోపు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లిస్తే 25 శాతం రిబేట్ ప్రకటించిందని తెలిపారు. రెండు రైస్‌మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ గడవులోపు బియ్యం సేకరించి ప్రభుత్వానికి అందించాలని యజమానులకు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నగేశ్, పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

మల్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి గల రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్ తెలిపారు. మండలంలోని మద్దుట్లలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించి ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఎకరానికి 57 మొక్కలు నాటాల్సి ఉంటుందని అందుకు 90శాతం రాయితీతో ఒక్కో మొక్కకు రూ.20 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ ఉంటుందని అన్నారు. ఏఈవో శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ రద్దు చేయాలని ఆందోళన



ఆత్మకూర్ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలోని పెద్దవాగులో ఇసుక రీచ్‌కు ప్రభుత్వం ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని శనివారం గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అనంతరం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్‌లకు వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని వాగులో నుంచి ఇసుకను తరలించడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయన్నారు. కొన్ని సంవత్సరాలుగా తాగు, సాగు నీరుకి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వరద కాల్వ ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని వాపోయారు. తాగు, సాగు నీటికి ప్రధాన నీటి వనరు అయిన గ్రామంలోని పెద్దవాగులో నుంచి ఇసుకను రవాణా చేస్తే భూగర్భ జలాలు తగ్గి రైతులు రోడ్డు మీద పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని అధికారులను కోరుతూ వినతి పత్రాలను అందజేసినట్లు తెలిపారు. అధికారులకు వినతిపత్రం అందజేసిన వారిలో పలువురు గ్రామస్థులు ఉన్నారు.

మత సామరస్యాన్ని పాటించాలి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యాన్ని పాటించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంతంలో జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు వసీం ఇచ్చిన ఇఫ్తార్ విందులో నర్సింగరావు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరం కలిసి పండగలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ భూంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, అన్నం అనిల్, పువ్వుల ప్రభాకర్, అడెపు మధు, ఏఆర్ అక్బర్, ఎంబేరి సత్యనారాయణ, చిలువేరి విజయ్, ఖయూం, ఆర్ భూమయ్య, పసుల కృష్ణప్రసాద్, చిట్యాల లక్ష్మీనారాయణ, వాసం అజయ్, జెట్టి లక్ష్మణ్, అమ్ముల రాహుల్, నిఖిల్ విష్ణు, కాశిరెడ్డి, మిట్టపల్లి భూమేశ్ పాల్గొన్నారు.

'నీటిని పొదుపుగా వాడుకోవాలి'



మాట్లాడుతున్న భూగర్భ జల అధికారి నాగరాజు

కథలాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటి పోతున్నందు వల్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భ జల శాఖ ఉప సంచాలకులు నాగరాజు, సీనియర్ హైడ్రాలజిస్ట్ శ్రీకుమార్ సూచించారు. కథలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్ రైతువేదికలో ఆదరణ సేవాసమితి సమన్వయంతో రైతులకు ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పొలాల వద్ద ఫాంపాండ్‌లు నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడుగుంతలను రైతులు తమ బావుల సమీపంలో ఏర్పాటు చేసుకుంటే ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ఏఓ యోగిత మాట్లాడుతూ రైతులు ముందస్తు ప్రణాళికలు చేసుకుంటే నీటి ఇబ్బందుల నుంచి గట్టెక్కడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీలత, టెక్నికల్ అసిస్టెంట్ అఖిల్, పంచాయతీ కార్యదర్శి గంగాలక్ష్మణ్, లింబాద్రి, రవి, ఏఈఓలు సుష్మశ్రీ, శ్రావణ్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

-సీపీఐ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు చాడ వెంకటరెడ్డి

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతామని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో జిల్లా కమిటీ సమావేశంలో చాడ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆగడాలు పెరిగి పోయాయని విమర్శించారు. కమ్యూనిస్టుల రూపుమాపే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.

రాష్ట్ర బడ్జెట్ విషయా నికొస్తే రూ. 7లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికీ ప్రభుత్వం 3 లక్షల కోట్ల పైచిలుకు బడ్జెట్ ప్రవేశపెట్టడంతో పాటు సంక్షేమ పథకాలకు కొంత మేరకైనా కేటాయింపు చేపట్టడం శుభ సూచికమని అన్నారు. అంకెల గారడీకి పరిమితం కాకుండా ఆయా పథకాలకు సంబంధించి కేటాయింపులు సక్రమంగా అమలు జరిగితే ప్రజలకు మేలు జరుగుతుందని అన్నారు. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పని చేయాలన్నారు. శాసనసభలో ఎస్సీ వర్గీకరణ చట్ట బద్ధత కల్పించడానికి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల్ కేటాయింపునకు సంబందిచిన బిల్లు అమోదం తెలుపడంపై హర్షం ప్రకటించినట్లు తెలిపారు. ఏప్రిల్, మే నెలలో గ్రామ మండలల కేంద్రాలలో సీపీఐ మహాసభలు పూర్తి చేసుకోని జూన్ 5వ తేదీన జగిత్యాల జిల్లా కేంద్రంలో బారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా కమిటి తీర్మాణం చేసింది. ఈ నెల 23వ తేదీన భగత్ సింగ్ వర్ధంతిని అన్ని చోట్ల ఘనంగా నిర్వహించాలని సంబదింత కరపత్రంను ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెన్న విశ్వనాథం, సుతారి రాములు, ముక్రం, కొక్కుల శాంత, ఎన్నం రాధ, మునుగోరీ హన్మంత్, మహ్మద్ మౌలానా, ఉస్మాన్ అక్రం, ఉస్మాన్, వెన్న మహేష్, భూమేశ్వర్, సాంబారి మహేష్, కిరణ్‌లు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లపై నిషేధం విధించాలి

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ యాప్‌లను పూర్తిగా నిషేధించాలని బీజేపీ మాజీ కౌన్సిలర్ పెండం గణేష్ డిమాండ్ చేశారు. శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెట్టింగ్ కారణాలతో దేశంలో ఎంతో మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బెట్టింగ్ సైట్లను ప్రమోట్ చేసిన సినీ ప్రముఖులతో పాటు ఇతర వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా
ఏర్పాట్లు చేయాలి
చిన్న హనుమాన్ జయంతి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష 6

వైభవంగా ఉగ్రనారసింహుడి
ఏకాంతోత్సవం
ధర్మపురిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు 7

జగిత్యాల మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమిషనర్ స్పందనకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు, సిబ్బంది

జగిత్యాల అర్బన్, 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కమీషనర్‌గా స్పందన శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను పలు వివాదాల నేపథ్యంలో కలెక్టర్ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీంతో రాయికల్ ఎంపీడీవో చిరంజీవికి అదనపు బాధ్యతలు ఇచ్చి మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన స్పందన శనివారం పూర్తి స్థాయి జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్‌కు చిరంజీవితో పాటు మున్సిపల్ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన 41 మందికి జైలు శిక్ష

వేములవాడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన 91మంది మందుబాబులకు వేములవాడ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యోతిర్మయి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. గత 14రోజుల వ్యవధిలో జరిపిన వాహనాల తనిఖీ సందర్భంగా మద్యం సేవించి పట్టుబడిన వారిని శనివారం కోర్టులో ప్రవేశపెట్టామని, వీరిలో ఇద్దరికి ఏడు రోజులు జైలు శిక్ష, ఏడుగురికి మూడు రోజులు జైలు శిక్ష, ఐదుగురికి ఐదు రోజులు జైలు శిక్ష, 27 మందికి రెండు రోజుల జైలు శిక్ష, మిగతా 50 మందికి జరిమానా విధించారని ఆయన వెల్లడించారు.

గిరిజన మహిళలకు రూ.20 వేల జరిమానా

ఎల్లారెడ్డిపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించిన ఎలారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ తండాకు చెందిన గిరిజన మహిళకు జ్యోతికి తహసీల్దార్ సుజాత రూ.20 వేల జరిమానా విధించారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. తండాకు చెందిన గిరిజన మహిళ జ్యోతి గతంలో సారా తయారు చేస్తూ పట్టుబడగా తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో ఆమెకు రూ.20 జరిమానా విధించారని చెప్పారు. సారా తయారీ, అమ్మకాలు సాధించడంతో పాటు బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు.

మెడికల్ కళాశాలలో కాంట్రాక్టు కార్మికుల వెట్టి చాకిరి

- వేతనంలో రూ.4500 కోత
- అడిగితే ఉద్యోగం నుంచి తొలగింపు.
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు



కళ్యాణ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా వేతనంలో రూ.4568కోత విధిస్తున్నట్లు కార్మికులు ఆరోపించారు. మెడకల్ కళాశాలలో 75 పారిశుధ్య, సెక్యూరిటీ పోస్టులకుగాను 42మంది విధుల్లో ఉన్నారు. ఎలైన్ ఏజెన్సీ ఈ కాంట్రాక్టును దక్కించుకున్నది. ఇందులో 22మంది శానిటేషన్ విభాగంలో, సెక్యూరిటీ విభాగంలో 23మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి వేతనం రూ.16500లకుగాను రూ.875 పీఎఫ్, రూ.52 ఈఎస్ఐకి జమ అవుతుండగా మిగితా రూ.15,573 రావాల్సి ఉండగా రూ.11005 మాత్రమే కాంట్రాక్టర్ చెల్లిస్తున్నారు. ఈ విషయమై ప్రశ్నించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. రూ.4568 ఎందుకు కోత విధిస్తున్నారో కాంట్రాక్టర్ చెప్పడం లేదు. అంతేకాకుండా కార్మికులపై కూడా పని భారం మోపుతున్నారు. నలుగురు పని చేసే చోట ఇద్దరితో పని చేయిస్తు న్నారు. కళాశాలలో మూడు షిఫ్టుల్లో 42మంది మాత్రమే పని చేస్తున్నారు. ముగ్గురు సూపర్‌వైజర్ విధులు నిర్వ హించాల్సి ఉండగా ఇద్దరితోనే నెట్టుకు వస్తున్నారు. 75పోస్టులకు గాను మిగతా 33పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయకపోవడంతో కార్మికులు పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు.

● అడ్వాన్స్‌లు, ప్లేడేలు లేవు...

కాంట్రాక్టు కార్మికులకు దసరా, దీపావళి అడ్వాన్స్, బోనస్ కాంట్రాక్టర్ చెల్లించడం లేదు. ప్లేడేలో డ్యూటీ చేసినా కూడా రెస్ట్ ఇవ్వడం లేదు. నెలకు నాలుగు సెలవులు ఇవ్వాల్సి ఉండగా సెలవు దినాల్లో కూడా పని చేయించుకుంటున్నారు. ఆరోగ్యం బాగా లేకపోయినా విధులకు హాజరు కావాలని అంటున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● అడిగితే తొలగిస్తామని బెదిరింపు

అసలు వేతనం రూ.16500 అయితే చేతికి వచ్చేది రూ.11005 మాత్రమే ప్రతీ నెలా కాంట్రాక్టర్ ఖాతాలో జమ చేస్తున్నాడు. ఇందులో కాంట్రాక్టర్ పీఎఫ్ రూ.875, ఈఎస్ఐ రూ.52 జమ చేస్తున్నారు. తమకు వచ్చే చాలీ చాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతు న్నామని, రోజు రోజుకు నిత్యా వసర ధరలు పెరిగిపోతున్నాయని, అసలు వేతనంలో కోత విధిస్తే ఎలా బతకాలని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే పని లేదంటూ వెళ్లగొడుతున్నారని, తాము ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు.

-వేతనాల్లో కోత విధిస్తున్నారు..

- శనిగరపు చంద్రశేఖర్, ఏఐటీయూసీ అధ్యక్షులు



కార్మికుల చేత మెడికల్ కళాశాలలో పని చేయిస్తున్న కాంట్రాక్టర్ వారికి రూ.16500 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.4528 కోత విధించి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీనిపై గతంలో ప్రిన్సిపాల్‌కు కూడా ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోవడం లేదు.

పనిముట్లు కూడా ఇవ్వడం లేదు...

- అబ్దుల్ కరీం, కార్మిక నాయకుడు



శానిటేషన్ విభాగంలో పని చేసే కార్మికులకు పనిముట్లు ఇవ్వడం లేదు. పెనాయిల్, చీపుర్లు ఇవ్వాల్సి ఉండగా ఆరు నెలలకోసారి కూడా వాటిని ఇవ్వకుండా ఆ బిల్లును కూడా కాంట్రాక్టర్ జేబులో వేసుకుం టున్నారు. శ్రమ దోపిడీకి గురి చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కమాన్‌పూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జూలపల్లి గ్రామంలో ఆదర్శ నగర్‌లో శనివారం సాయంత్రం ఎస్సై కొట్టెప్రసాద్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై దాడిచేయగా నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఆదర్శనగర్‌లోని ఇల్లుటూరి పుల్లయ్య ఇంట్లో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో ఎస్సై దాడి చేయగా 8ఇంక్లైన్‌కాలనీకిచెందిన నలుగురు పట్టుబడగా వారివద్ద నుంచి రూ.2450 నగదు, రెండు సెల్‌ఫోన్లు పట్టుబడ్డాయి. స్టేషన్‌కు తరలించారని ఎస్సై కొట్టెప్రసాద్ తెలిపారు.

దాడికి పాల్పడిన సంఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దాడికి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య, అతడి కొడుకులు శివాజీ, విష్ణులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. గ్రామంలోని మునిగె శంకర్ ఈ నెల 21న తన ఇంటి వద్ద మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మునిగె బాలమల్లయ్య గొడవకు దిగాడని పేర్కొన్నారు. ఇద్దరి నడుమ గొడవ చోటు చేసుకోవడంతో శంకర్ సోదరుడు దేవయ్య అక్కడకు చేరుకుని ఎందుకు తిడుతున్నావని బాలమల్లయ్యను ప్రశ్నించాడని తెలిపారు. ఆగ్రహించిన బాలమల్లయ్య, అతని కొడుకులు శివాజీ, విష్ణులు శంకర్, దేవయ్యలను దూషిస్తూ కర్రలతో దాడికి దిగారని పేర్కొన్నారు. అడ్డుగా వెళ్లిన శంకర్ భార్య భాగ్యలక్ష్మి, సోదరి మంజుల, వదిన అమృతలను చితకబాదారని చెప్పారు. బాధితుడు శంకర్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలీ మృతి

చందుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనులు చేస్తున్న ఓ కూలీ అస్వస్థతకు గురై పనిచోటనే మృతిచెందిన సంఘటన చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల లచ్చయ్య(60) అనే ఉపాధి హామీ కూలీ కొంతకాలంగా గ్రామంలో ఉపాధిహామీ పనులకు హాజరవుతున్నాడు. శనివారం గ్రామంలో రోడ్డుపనులకు హాజరయ్యాడు. విరామ సమయంలో భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే తోటికూలీలు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియాఆసుపత్రి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందిస్తామని ఎంపీడీవో ప్రదీప్ కుమార్, ఏపీవో రాజయ్యలు తెలిపారు.



లచ్చయ్య (ఫైల్)

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తంగళ్లపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మామిండ్ల మహేష్ (24) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నాలుగు సంవత్సరాల క్రితం మహేష్ వివాహం చేసుకోగా, ఇప్పటివరకు సంతానం కలగలేదు. దీంతో తీవ్రమనస్తాపం చెంది ఈనెల17వ తేదీన పురుగుల మందు తాగాడు. మహేష్‌ను ఎల్లారెడ్డిపేటలోని ఓప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య కల్పన ఉంది. ఈసంఘటనపై పోలీసులు కేసునమోదు చేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బోయినపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం మానువాడ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన దాసరి నర్సయ్య(58) తన ఇంటి ఎదురుగా మునగచెట్టు విద్యుత్ తీగల వరకు ఉన్నాయని, కొమ్మలను తొలగించేందుకు చెట్టు పైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు నరసయ్య విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పృధ్వీధర్‌గౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని మహిళ బలవన్మరణం

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుకుంట గ్రామానికి చెందిన మేకల పద్మ(48) జీవితంపై విరక్తిచెంది శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పద్మ భర్త తిరుపతి బతుకుదెరువు కోసం 13ఏండ్ల క్రితం మలేషియా వెళ్లి 11నెలల క్రితం ఇంటికి వచ్చాడు. నెల రోజుల నుంచి తిరుపతికి జ్వరం వస్తుండగా ఆసుపత్రిలో చూపించగా టీబీ ఉన్నట్లు డాక్టర్ చెప్పారు. తిరుపతిని మరిన్ని పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. భార్య పద్మ అతనికి ఎన్నిసార్లు చెప్పినా వినకపోవడంతో ఆవేదనకు గురైంది. జీవితంపై విరక్తి చెందిన పద్మ ఇంట్లో పురుగుల మందుతాగి, ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పద్మకు కూతురు, కొడుకు ఉన్నారు. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ టవర్ ఎక్కిన లారీ డ్రైవర్

పాలకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్ నగర్ సిమెంటు కంపెనీ సమీపంలోని విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి శనివారం లారీడ్రైవర్ సార్లనరేష్ హంగామా సృష్టించాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆర్ స్వామి సంఘటన స్థలానికి చేరుకొని నరేష్‌ను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. నరేష్ నిత్యం సేవించి లారీ నడిపేవాడని, ఇది గమనించిన లారీ అసోసియేషన్ సభ్యులు అతడిని విధుల్లో నుంచి తొలగించారు. దీంతో ఉపాధి పోయిందనే మనస్తాపానికి గురై ఈ సంఘటనకు పాల్పడ్డాడని తెలిపారు.

జైలులో మౌలిక వసతుల పరిశీలన

కరీంనగర్ క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలును కరీంనగర్, పెద్దపల్లి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శులు కె.వెంకటేష్, కె.స్వప్న శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీలతో మాట్లాడి భోజన, న్యాయసేవలు, ఆరోగ్యం, ఇతర సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్‌గా న్యాయవాదిని నియమించుకునే స్థోమత లేనివారికి ప్రభుత్వ న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ జి.విజయ్‌డేని, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్ రెడ్డి, ఎల్ రమేష్, కె.శేఖర్, పెద్దపల్లి కోర్టు సూపరింటెండెంట్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్‌లు శ్రీనివాస్, కె.సంకీర్తన పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని మేడిపల్లి గ్రామశివారులో శనివారం ఎస్ఐ అనిల్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి తరలిస్తున్న పోగుల అజయ్ అనే యువకుడిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అజయ్ మెట్‌పల్లి వైపు ద్విచక్రవాహనం మీద వెళ్తుండగా పోలీసులను చూసి తప్పించుకొనే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. అతడివద్ద నుంచి 300గ్రాముల గంజాయి, ఒకఫోన్, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పెర్కోన్నారు. గంజాయి తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

ఆటో ట్రాలీ బోల్తా

● 16 మంది మహిళా కూలీలకు గాయాలు ● ముగ్గురి పరిస్థితి విషమం

మంథనిరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మహిళా కూలీలను తీసుకువెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా పడిన ఘటనలో 16మందికి తీవ్ర గాయాలు కాగా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. భట్టుపల్లి గ్రామానికి చెందిన 20 మంది మహిళ కూలీలు గ్రామానికి చెందిన సతీష్ అనే వ్యక్తికి చెందిన టాటా ఏసీ ట్రాలీలో భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని మల్లారంలో మిర్చి ఏరడానికి ఉదయం 7 గంటల సమయంలో బయలుదేరి వెళ్ళారు. నాగెపల్లి వద్దకు రాగానే ఆటోస్టిరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆటో అదుపు తప్పి మంథని-కాటారం ప్రధాన రహదారిపై బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడ్డ వారందరిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించారు. ఇందులో బందెల కిష్టమ్మ, అప్పాల శైలజ, అప్పాల వనితలకు తీవ్రగాయాలు కావడటంతో వారిని కరీంనగర్‌కు తరలించారు. వీరితోపాటు గడ్డి మల్లక్క, సత్తెమ్మ, సమత, ఎర్రమ్మ, కందుల రాజేశ్వరి, పోశక్క, పొలగాని సమ్మక్క, కొమురక్క, జంగా లక్ష్మి, స్రవంతి, కమల, బొద మల్లమ్మలకు మంథనిలో ప్రథమ చికిత్స అనంతరం గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రామకృష్ణతో ఫోన్‌లో మాట్లాడి గాయపడ్డవారికి చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం గోదావరిఖని, కరీంనగర్‌కు తరలించాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు ఐలి ప్రసాద్, ఆరెల్లి కిరణ్‌గౌడ్‌లు ఆసుపత్రికి వచ్చి బాధితులతో మాట్లాడారు. గోదావరిఖనిలో ప్రభుత్వ ఆసుపత్రి వెళ్ళిన క్షతగాత్రులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందే విధంగా ఏసీపీ మడత రమేష్ ఆసుపత్రికి వచ్చి పర్యవేక్షించారు. మంథని సీఐ రాజు, ఎస్ఐ రమేష్‌లు ఆసుపత్రికి వచ్చి సంఘటన వివరాలు సేకరించారు.



సంఘటన స్థలంలో బోల్తా పడిన ఆటో ట్రాలీ

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

● డ్రైవర్‌కు స్వల్పగాయాలు

కోరుట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం స్కూల్‌వ్యాన్ ఢీకొట్టడంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు, స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గౌతమ్‌హైస్కూల్ విద్యార్థులను పాఠశాలకు తరలించేందుకే వెళ్తుండగా ప్రమాదం జరిగింది. హాజీపుర వైపువ్యాన్‌ను తీసుకుపోయే క్రమంలో వ్యాన్‌రోడ్డు ప్రక్కకు ఉన్న ట్రాన్‌ఫార్మన్ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ భారీ శబ్దంతో పేలిపోయింది. దీంతో విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడింది.స్థానికులు విద్యుత్ అధికారులతోపాటు పోలీసులకు సమాచారం అందించారు. డ్రైవర్ అవదూత మారుతి స్వల్పగాయలతో బయటపడగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐశ్రీకాంత్ తెలిపారు. అనంతరం విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన స్కూల్ బస్సు

పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థిని

శంకరపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని పుట్టెడు దుఃఖంలో పదో తరగతి పరీక్ష రాసింది. మండలంలోని కొత్తగట్టు గ్రామానికిచెందిన చీర్లంచ ప్రియాంక(34) కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్‌లో చికిత్సపొందుతోంది. శనివారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. ఈ విషయాన్ని ప్రియాంక కూతురు పౌర్ణమికి తెలియకుండా పరీక్షరాసే వరకు వేచి చూశారు. పరీక్షలు రాసిన అనంతరం తల్లి మృతిచెందిన విషయాన్ని చెప్పడంతో సిరిసిల్ల జిల్లాలో పరీక్షరాసిన పౌర్ణమి హుటాహుటిన కొత్తగట్టు గ్రామానికి చేరుకుంది. తల్లి మృతదేహంపై పడి గుండెలు విసేలా రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

● రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ

కరీంనగర్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనలో హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, వడగండ్ల వానతో పంటలకు నష్టం వాటిల్లడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో మామిడి, వరి పంటలు దెబ్బ తిన్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులను పంపించి దెబ్బతిన్న పంటలను పరిశీలించాలని కోరినట్లు తెలిపారు.

పెద్దపల్లి ట్రాలీ ఆటో ఘటనపై దిగ్భ్రాంతి

పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగేపల్లి బస్‌స్టాప్ వద్ద ట్రాలీ ఆటో బోల్తా ప్రమాదంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలి

● చిన్న హనుమాన్ జయంతి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీ సమీక్ష

మల్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో వచ్చేనెల11 నుంచి జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కొండగట్టులో ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి జయంతి ఏర్పాట్లను పరిశీలించారు. కోనేరు, దీక్షవిరమణ మండపం, వైజంక్షన్ తదితర ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. జయంతి సందర్భంగా చేపట్టే ఏర్పాట్ల గురించి సమీక్షజరిపారు. మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, దీక్ష విరమణ మండపం వద్ద బారికేడ్ల ఏర్పాటును పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విద్యుత్ లైట్స్, చలువ పందిళ్లు, తాగునీరు, మొబైల్ టాయిలెట్స్ పారిశుధ్యానికి సంబంధించి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. ట్రాన్స్‌కో, పంచాయితీరాజ్, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతంకు కృషి చేయాలని అన్నారు. అంతకు ముందు స్వామి వారి సన్నిధిలో కలెక్టర్, ఎస్పీ పూజలు నిర్వహించగా అధికారులు సన్మానించారు. వారివెంట జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, డిఎస్పీ రఘు చందర్, డీపీవో మదన్‌మోహన్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అంతరిస్తున్న తాటి వనాలు

● ఉపాధి కోల్పోతున్న కల్లుగీత కార్మికులు



జూలపల్లి శివారులో ఎండిపోతున్న తాటిచెట్లు

జూలపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికులకు ఉపాధి ఇస్తున్న తాటి చెట్లు అంతరిస్తున్నాయి. మొగిరోగం సోకి ఎండిపో తున్నాయి. కల్లు విక్రయింతో ఉపాధి పొందుతున్న కల్లుగీత కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని మండల కల్లుగీత కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూలపల్లి, కుమ్మరికుంట, కాచాపూర్, వడుకాపూర్, తెలుకుంట తదితర గ్రామా ల్లో తాటిచెట్లకు మొగిరోగంతో క్రమంగా అవి అంతరించి పోతున్నా యని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్ల సంరక్షణపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే వనాలు అంత రించిపోతున్నాయని గౌడ కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాటిచెట్లు ఎక్కడం ప్రాణాలకే ప్రమాదం అని తెలిసినా పొట్ట కూటికోసం కల్లుగీయక తప్పడం లేదంటున్నారు. తాటిచెట్లు ఎండి పోతుండడంపై కల్లుగీతకార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర ఉపాధి మార్గాలను చూపాలని వారు కోరుతున్నారు.

కల్లులేక రోజు కూలి గిట్టడంలేదు


- బొంగాని కమలాకర్‌గౌడ్, గౌడసంఘం మాజీ ఉపాధ్యక్షులు గ్రామం,మం, జూలపల్లి



వారసత్వంగా వస్తున్న కల్లుగీత వృత్తిపైనే ఆధారపడి బతుకుతున్న తమ కుటుంబాలకు ప్రస్తుతం గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. గ్రామాల్లోని తాటిచెట్లకు రోగాలు సోకి ఎండిపోతున్నాయి. వాటిని కాపాడేప్రయత్నం ప్రభుత్వం చేపట్టాలి. రోజురోజుకు చెట్లు ఎండిపోయి కల్లులేక రోజువారి కూలి కూడా రావడం లేదు.

ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధిచూపాలి

- అమరగాని మల్లేశం, కల్లుగీత కార్మికుడు గ్రామం, మం. జూలపల్లి.



ఎన్నో ఏండ్లుగా తాటిచెట్లనే ఉపాధిగా చేసుకని తమ కుటుంబాలను వెల్లదీస్తున్నాం. తాటిచెట్లు రోగాలతో ఎండిపోతున్నాయి. ప్రస్తుతం తమకు పూటగడవడం కష్టంగా మారింది. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపి ఆదుకోవాలి.

రాజన్న ఆలయంలో 30 నుంచి

శ్రీరామ నవరాత్రోత్సవాలు



వేములవాడ కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో వారం రోజులపాటు ఉగాది, శ్రీరామ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న ఆలయంలో మార్చి 30వ తేదీ నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి శ్రీస్వామివారలకు శ్రీసీతారామ చంద్ర స్వామివారలతో పాటుగా పరివార అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 30వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 10.15 పంచాంగ పూజ సాయంత్రం 4.30 గంటలకు పంచాంగ శ్రవణం, పండిత సన్మానం, రాత్రి 8 గంటలకు స్వామివారి పెద్దసేవ ఊరేగింపును కన్నులపండుగగా చేపట్టనున్నారు. అంతేకాకుండా 4వ తేదీ శుక్రవారం నుంచి 6వ తేదీ ఆదివారం వరకు మూడు రోజులపాటు భక్తోత్సవం, హవనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

6న సీతారాముల కల్యాణం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సీతారామచంద్రుల దివ్య కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా ఏప్రిల్ 6వ ఆదివారం నిర్వహించనున్నారు. అనంతరం వైభవంగా స్వామివారి రథోత్సవం రాత్రి డోలోత్సవం నిర్వహించనున్నారు.

ఇంటర్ తర్వాత వివిధ కోర్సులు



విద్యార్థులకు 113 కోర్సులను సూచించిన సీబీఎస్ఈ

చొప్పదండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం చాలా మంది విద్యార్థులు ఇంటర్ తరువాత ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరుతు న్నారు. ఇంజనీరింగ్ కోర్సుల్లోనూ కంప్యూటర్ సైన్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంటర్ తరువాత ఇంజనీరింగ్‌తో పాటు 113 కోర్సుల జాబితాను సీబీఎస్ఈ విద్యార్థులు, తల్లిదండ్రుల కోసం బుక్ లెట్‌ను రూపొం దించింది. ఇంజనీరింగ్ కోర్సు, ఫిషరీస్, ఎన్విరాన్మెంటల్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, చార్టెడ్ అకౌంటెంట్ లాంటి అనేక రంగాలలో ఉద్యోగాలను కల్పించే కోర్సులు ఉన్నాయి.ఈ నేపథ్యంలో ఇంటర్ తరువాత అందుబాటులో ఉన్న వివిధ డిప్లమా, డిగ్రీ కోర్సుల వివరాలు విద్యార్థుల కోసం...

● ఇంజనీరింగ్ కోర్సులు:



ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ ఇంజనీరింగ్, సెరామిక్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మ్యాన్యుఫ్యాక్చ రింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజ నీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్, పాలీమర్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్, మెటాలర్జీ, మెటరాలజీ, రోబోటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్

● మేనేజ్‌మెంట్ కోర్సులు:

బ్యాంక్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంట్స్, చార్టర్డ్ అకౌంటెన్సీ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనాలిసిస్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్



● ఇతర కోర్సులు

ఆస్ట్రోనమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఫిజికల్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, బయోటెక్నాలజీ, ఎర్త్‌సైన్స్ /జాగ్రఫీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఫిషరీస్, ఫ్లోరికల్చర్/హార్టికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, ఓషియనోగ్రఫీ, స్టాటిస్టికల్ సైన్స్, వైల్డ్ లైఫ్ బయాలజీ, జువాలజీ, ఆంత్రోపాలజీ, ఆర్కియాలజీ, ఆర్ట్ రిస్టోరేషన్, క్యూరేషన్, ఎడ్యుకేషనల్/వొకేషనల్ స్కూల్ కౌన్సిలర్, మాన్యుమెంట్స్ అండ్ స్కల్ప్చర్ రిస్టోరేషన్, మ్యూసియాలజీ, సోషల్ వర్క్, స్పెషల్ ఎడ్యుకేటర్, లా, అడ్వర్టైజింగ్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, పబ్లిక్ రిలేషన్స్, ఆర్ట్ డైరెక్షన్, కొరియోగ్రఫీ, డైరెక్షన్, ఫిల్మ్ /డ్రామా ప్రొడక్షన్, ఫైన్ ఆర్ట్స్, పర్ఫామింగ్ ఆర్ట్స్, వోకల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, యానిమేషన్, సినిమాటోగ్రఫీ, కమ్యూనికేషన్ డిజైన్, డిజైన్, గ్రాఫిక్ డిజైనింగ్, ఫోటోగ్రఫీ, యాక్చురియల్ సైన్సెస్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్, కార్పొరేట్ ఇంటెలిజెన్స్, డిటెక్టివ్, ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషియన్, ఫారిన్ లాంగ్వేజెస్, హోమ్ సైన్స్, ఇంటీరియర్ డిజైనింగ్, లిబరల్ స్టడీస్, లైబ్రరీ సైన్సెస్, మాంటెస్సరీ టీచింగ్, న్యూట్రీషియన్ అండ్ డైటెటిక్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ ట్రావెల్.

● వైద్య సంబంధ కోర్సులు:



ఆయుర్వేద (బీఏఎంఎస్), డెంటల్ బీడీఎస్, హోమియోపతి, న్యాచురోపతి, ఫార్మసీ, సిద్ధ, యునానీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలి టేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, ఫిజియోథెరపీ, రిహ్యాబిలిటేషన్ సైకాలజీ, రిహ్యాబిలిటేషన్ థెరపీ, వెటర్నరీ సైన్సెస్, స్పీచ్ లాంగ్వేజ్ అండ్ హియరింగ్

బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఫీజుల

బకాయిలు విడుదల చేయాలి

- బీఏఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు

కరీంనగర్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు సంబంధించిన ఫీజు బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో స్కూళ్లను ప్రభుత్వమే నడిపించాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రాష్ట్ర కార్యదర్శి, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో 180 బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎస్సీ విద్యార్థులు 18వేలు, ఎస్టీ విద్యార్థులు 7వేల మంది మొత్తం 25వేల మంది విద్యార్థులు చదువు కుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 2004లో ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారం భించారని తెలిపారు. 17వేల మంది అణచి వేతకు గురైన వర్గాలకు సంబంధించిన వారు, ఎక్కువ మంది జోగిని వ్యవస్థకు గురైన వారి పిల్లలు, వ్యవసాయ కూలీల పిల్లలు లబ్ధిపొందారని పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి 20వేల రూపాయలు చెల్లించే వారని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఈ సీట్ల సంఖ్యను 25 వేలకు పెంచడమే కాకుండా రూ.20 వేల మొత్తాన్ని రూ.42 వేలకు పెంచారని పేర్కొన్నారు. ఏటా రూ.100 కోట్ల బడ్జెట్ రిలీజ్ చేశారని, ఇందులో రూ.80 కోట్లు హాస్టళ్లకు రూ.20 కోట్లు డేస్కాలర్ విద్యార్థులకు నిధులు విడుదలయ్యేవని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లకు 200 కోట్ల నిధులు విడుదల చేయాల్సి ఉండగా మంత్రులు, ఎమ్మెల్యేలు తమకు అనుకూలంగా ఉన్న స్కూళ్లకు రూ.50 కోట్లు మంజూరు చేయించుకున్నట్లు తెలిపారు. మిగతా 150 కోట్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేయక పోవడం శోచనీయమని పేర్కొన్నారు. వెంటనే 150కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తదుపరి కార్యాచరణ చేపడుతామన్నారు.

కొండగట్టులో చలువ పందిళ్ల జాడేదీ?


కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి వేసవిలో భక్తుల సౌకర్యార్థం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పరిధిలో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తుండగా ఈ సారి ఇంకా వాటి జాడ కనిపించడం లేదు. ఇటీవల భానుడి ప్రతాపంతో ఎండలు మండుతుండగా భక్తులు అసౌకర్యానికి గురి అవుతున్నారు. ఆలయ ఆవరణంలో నడవడానికి కొంత మేర మ్యాట్ వేయగా చలువ పందిళ్ల మాత్రం ఏర్పాటు చేయలేదు. ప్రతి ఏటా టెండర్ ద్వారా సుమారు రూ.10లక్షల పైచిలుకుతో చలువ పందిళ్ల వేస్తుండగా ఇప్పటి వరకు ఏర్పాటు కాకపోవడంతో మధ్యాహ్న సమయంలో ఆలయ ఆవరణలో భక్తులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. విద్యాసంస్థలకు త్వరలోనే వేసవి సెలవులు రానుండడం, హనుమాన్ జయంతి ఉత్సవాలు సమీపిస్తుండడంతో భక్తుల రాక పెరుగుతుంది. టెండర్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని భక్తులు అంటున్నారు. త్వరలో చలువ పందిళ్ల పనులు ప్రారంభం అవుతాయని దేవస్థానం పర్యవేక్షకులు సునీల్ తెలిపారు.

ఆలయంలో భక్తుల రద్దీ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వందలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

కనుమరుగవుతున్న గొంగళ్లు

● ఆదరణ కోల్పోవడంతో నేసే వారు కరువు



కొడిమ్యాల, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాలు 20 సంవత్సరాల క్రితం గొంగళ్ల నేతకు ప్రసిద్ధి చెందాయి. కానీ ప్రస్తుతం గొంగళ్లకు ఆదరణ తగ్గింది. గొంగళ్లకు ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లోకి పలు రకాల బ్లాంకెట్లు రంగ ప్రవేశం చేయడంతో గొంగళ్ల క్రమంగా కనుమరుగవుతున్నాయి. మండలంలోని పూడూర్, నమిలికొండ గ్రామాల్లో గతంలో సుమారు 50 మంది గొంగళ్లను నేస్తూ జీవనోపాధి పొందేవారు. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో గొంగళ్ల నేసే వారు కూడా కరువయ్యారు. ప్రస్తుతం పూడూర్ గ్రామానికి చెందిన రొడ్డ అంజయ్య అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి గొర్రె ఉన్నితో తయారు చేసిన గొంగళ్లను తీసుకువచ్చి పసుపు, ఎరుపు రంగులలో కడ అంచు కట్టి విక్రయిస్తున్నాడు. డిజైన్‌ను బట్టి 300 రూపాయల నుంచి 3వేల రూపాయల వరకు ఒక్కో గొంగళి ధర పలుకుతోంది. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మల్లన్న పట్నాల సమయంలో సుమారు లక్ష రూపాయల విలువైన గొంగళ్లు అమ్ముడు పోతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలకు వెళ్లి అక్కడ గొంగళ్లను అమ్ముకునే వారికి హోల్‌సేల్‌గా ఇచ్చివస్తాన్నారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

-రొడ్డ అంజయ్య, పూడూర్ గ్రామం



గొంగళ్ల తయారీకి కుర్మలకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను మంజూరు చేయాలి. 50 సంవత్సరాలు దాటిన కుర్మలకు ప్రభుత్వం పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.


అంచు కట్టుతున్న మహిళలు

ధర్మపురిలో ఘనంగా ఉగ్ర నారసింహుడి ఏకాంతోత్సవం


ధర్మపురిలో ఉగ్ర నారసింహస్వామి ఏకాంతోత్సవం


శేషప్ప కళావేదికపై చిన్నారుల ప్రదర్శన

● ముగిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి (ఉగ్ర) వారల ఏకాంతోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామి వారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టు ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అంతకు ముందు శేషప్ప కళావేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

26,27 తేదీల్లో వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో బీసీ కమిషన్ అధ్యయనం

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమ కులాల పేర్లను మార్చాలని వివిధ వర్గాల నుంచి వచ్చిన అభ్యర్థనలను స్వీకరించిన బీసీ కమిషన్ క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వేములవాడ, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నది. బీసీ కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమల గిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలతో కూడిన అధికారుల బృందం ఈనెల 26న వేములవాడ, 27న సిరిసిల్లలో వంశరాజ్, దొమ్మర కులస్థుల నివాస ప్రాంతాలను సందర్శించనున్నారు. అదే రోజున జగిత్యాల, ధర్మపురి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు

ఉమ్మడి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు


ఖో-ఖో పోటీలకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీలకు జిల్లాకు చెందిన ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరుగుతున్న అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఖో-ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు కట్ట సంతోష్ (చామనపల్లి జడ్పీహెచ్ఎస్), పీచు జ్యోతి(బొమ్మనపల్లి జడ్పీహెచ్ఎస్), జి రేణుక(కొత్తపల్లి జడ్పీహెచ్ఎస్), మార్గం నవీన్(నంచర్ల జడ్పీహెచ్ఎస్), వాసం నవీన్‌కుమార్(భూషణ్‌రావుపేట జడ్పీహెచ్ఎస్)లు పాల్గొంటున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో విశేష ప్రతిభచాటిన వీరు అఖిల భారత సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడల్లో తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీరిని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వి సూర్యప్రకాశ్, ఉమ్మడి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ సభ్యులు సీఐ కుమారస్వామి, ఎస్ఐ రమేష్, సీహెచ్ తిరుపతిరెడ్డి, ఏ రవీందర్, ఎస్కే మోయినుద్దీన్, ఆర్ తిరుపతిరెడ్డి, పెద్దపల్లి జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ కుమార్, డాక్టర్ వి కుమారస్వామి, రైల్వే ఖో-ఖో కోచ్ ఇ నరేష్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

రసాయన శాస్త్రంతో ఉపాధి అవకాశాలు

గణేశ్‌నగర్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రసాయన శాస్త్ర అధ్యయనంతో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని డాక్టర్ కే కిరణ్ కుమార్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీ ఫార్మా లిమిటెడ్ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ కే కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తూ లక్ష్య సాధన దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి నితిన్. రసాయన శాస్త్ర విభాగాధిపతి మేజర్ రేఖ్ల సంజీవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దూర్‌లో తాగునీటి కటకట..

- ● నెల రోజుల క్రితం కాలిపోయిన విద్యుత్ మోటారు
- ● వ్యవసాయ బోర్ల నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు
- ● ఫిర్యాదులు చేసినా పట్టించుకోని మున్సిపల్ అధికారులు


సిరిసిల్ల పెద్దూర్‌లో దుప్యానాయక్ తండాలో వ్యవసాయ బోరునుంచి వేసుకున్న పైప్‌లు ↑

తండాలో కాలిపోయిన బోర్‌మోటర్ →

సిరిసిల్ల రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటుచేసిన బోర్లు చెడిపోవడంతో నెల రోజులు నుంచి పెద్దూర్ గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక కౌన్సిలర్‌తో పాటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామాన్ని మున్సిపల్‌లో విలీనం చేసిన సమయంలో 8వ వార్డు, 9వ వార్డులుగా విభజించారు. అయితే పెద్దూర్ గ్రామంతోపాటు 9వ వార్డులోని దూప్యానాయక్ తండా, మాలపల్లె, తుర్కకాశీకాలనీ, బాబాజీ కాలనీలలో ఉన్న బోర్‌మోటార్లు నెలరోజుల క్రితం కాలి పోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. బోర్‌మోటార్‌కు మరమ్మతులు చేయించాలని ఇద్దరు మాజీ కౌన్సిలర్‌లతోపాటు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌మోటార్‌ను బాగుచేయించి నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

● తాగునీటి బావుల పైప్‌లైన్‌లను బాగు చేయాలి పెద్దూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో తాగునీటిని అందించేందుకు పక్కనున్న మానేరు వాగులో జీపీ నిధులతో రెండు బావులతో పాటు బోర్లను వేశారు. మంచినీటి ట్యాంక్‌లకు పైప్‌లైన్‌లను వేసి నీటిని అందించారు. మిషన్ భగీరథ రావడంతో ఆ బావులు, బోర్లను మున్సిపల్ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ పైప్‌లైన్‌లను దొంగిలించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మానేరు వాగులోని బావులు, బోర్లకు కొత్తగా పైప్‌లైన్‌లను వేసి నీళ్లు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

బోరు కాలిపోవడంతో తాగునీటి కోసం ఇబ్బందులు..

- భూక్య విజయ, దూప్యానాయక్ తండా



పెద్దూర్ శివారులోని దూప్యానాయక్ తండాలో తాగునీరు అందించే బోరు నెలరోజుల క్రితం కాలిపోయింది. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. రోజు ఉదయం, సాయంత్రం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. మున్సిపల్ అధికారులు స్పందించి కాలిపోయిన బోర్‌లను మరమ్మతులు చేయించాలి.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు..

- షేక్ అలీబీ, తుర్కకాశీ కాలనీ, పెద్దూర్



పెద్దూర్ శివారులోని తుర్కకాశీ కాలనీలో మిషన్ భగీరథ నీటి కోసం ట్యాంక్‌ను నిర్మించి ఇంటింటికి నల్లాలను ఏర్పాటు చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడిని తీర్చాలి.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

శ్రీనివాస్, ఎంఈవో, కథలాపూర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఎలా ఉంది?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో నాణ్యమైన బోధన అందిస్తున్నాం. చదువులో వెనకబడిన పిల్లలపై దృష్టి సారిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలు పర్యవేక్షణ చేస్తున్నారా?

ఎంఈవో: ప్రతీ పాఠశాలను పర్యవేక్షణ చేస్తున్నాం. కస్తూర్బాగాంధీ, మోడల్‌స్కూల్ హాస్టళ్లను వారానికి రెండుసార్లు తనిఖీలు చేస్తున్నాం. అపరిశుభ్ర వాతావరణం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్న భోజనం నిధులు విడుదల చేశారా?

ఎంఈవో: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి నిర్వాహకులకు జనవరి వరకు రావాల్సిన డబ్బులు విడుదల చేశాం. హెల్పర్లకు రూ.3 వేల చొప్పున వేతనం ఇస్తున్నాం. పైలెట్ ప్రాజెక్ట్ కింద కంప్యూటర్లు ఏర్పాటు చేయడానికి సిరికొండ పాఠశాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాం.

-కథలాపూర్

ఎస్సెస్సీ విద్యార్థులకు ఉచిత ఆటో సౌకర్యం

జగిత్యాలరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు పొరండ్ల మాజీ సర్పంచ్ పొగళ్ల సంధ్యారాణిశ్రీనివాస్ ఉచిత ఆటో సౌకర్యం కల్పించి ఔదార్యాన్ని చాటుకున్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి మాజీ సర్పంచ్ ఎగ్జామ్ సెంటర్ వరకు ఐదు సంవత్సరాలుగా పరీక్ష రాస్తున్న విద్యార్థులకు ఉచిత ఆటో సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు 510 మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5,116 లు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ సంధ్యారాణి శ్రీనివాస్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలి

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ రాయితీని ఉపయోగించుకోవాలని ధర్మపురి మున్సిపల్ కమీషనర్ ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ధర్మపురి పట్టణానికి చెందిన పెండ్యాల బాలకృష్ణకు మొట్టమొదటి ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్ కాపీని శనివారం ఆయన చేతుల మీదుగా అందించారు.

ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ బాలె గంగాధర్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వార్డు ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

అకాలవర్షంతో దెబ్బతిన్న పంటలు







లక్ష్మీపూర్ నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు, రాయికల్ మండలంలో నేలవాలిన మొక్కజొన్న, రాయపట్నంలో దెబ్బతిన్న వరి

జగిత్యాలరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాలవర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి, హైదరపల్లి, లక్ష్మీపూర్, నర్సింగాపూర్, జాబితాపూర్, చల్‌గల్, గుట్రాజ్‌పల్లి, సోమన్‌పల్లి, సంఘంపల్లి, కల్లెడ, పొరండ్ల గ్రామాల్లో 170 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి తిరుపతినాయక్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, మామిడి పంటలు, నువ్వుపంటలు, ఆరబోసిన పసుపుకొమ్ములు అకాల వర్షానికి దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. లక్ష్మీపూర్‌లో నష్టపోయిన పంటలను శనివారం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. జగిత్యాల రూరల్ మండలంలోని హైదరపల్లిలో నిన్న రాత్రి కురిసిన వర్షానికి పర్స వెంకటికి చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈవో హరీష్ పాల్గొన్నారు.

●వడగండ్ల వాన

ధర్మపురి: ధర్మపురి మండలంలోని రాయపట్నం, తిమ్మాపూర్, నేరెళ్ల గ్రామాల్లో కురిసిన వడగళ్ల వాన వల్ల తీవ్రంగా పంట నష్టం వాటిల్లింది. దీంతో రాయపట్నం గ్రామానికి చెందిన రైతులు బిల్లకూరి శేఖర్, ముక్కెర ప్రశాంత్, పోతరాజుల చంద్రమౌళి, పాయల శ్రీనివాస్ కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామాల్లో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న పంటలను కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, తహసీల్దార్ కృష్ణచైతన్య, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ఏఈవోలు రాజ్ కుమార్, అజయ్‌కుమార్, సమత పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. రాయపట్నం గ్రామంలో వరి పంట 850 ఎకరాలు, తిమ్మాపూర్‌లో 460 ఎకరాలు, నేరెళ్లలో మొక్కజొన్న 8 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్ తెలిపారు.

●నేల వాలిన పంటలు

రాయికల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి వరి, మొక్క జొన్న పంటలు నేల వాలాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● 240 ఎకరాల్లో పంట నష్టం

వెల్గటూర్: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పలు చోట్ల వరి నేల వాలగా, మరి కొన్ని చోట్ల మొక్కజొన్న పంట పడిపోయింది. పంట నష్టం జరిగిన గ్రామాలలో వ్యవసాధికారులు పర్యటించి నష్టపోయిన పంటలు, రైతుల వివరాలు సేకరించారు. చెగ్యాం, రాంనూర్, జగదేవ్‌పేట, సంకెనపెల్లి, కొత్తపల్లి గ్రామాలో పంట నష్టం ఎక్కువగా వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి సాయి కిరణ్ తెలిపారు. మండలంలో 225 ఎకరాల వరి, 15 ఎకరాల మొక్కజొన్న మొత్తం 240 ఎకరాలలో పంట నష్టం వాటినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. పంట నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

●దెబ్బతిన్న మొక్కజొన్న పంటలు

బుగ్గారం: మండల కేంద్రంలోని శుక్రవారం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను, నేలకొరిగిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి అక్షిత శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి అక్షిత మాట్లాడుతూ మండలంలో 250 ఎకరాల మొక్కజొన్న, పది ఎకరాల వరి నష్టపోయినట్లు గుర్తించామని అన్నారు. దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు అక్షయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

●నేల రాలిన మామిడి

మల్యాల: మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి పలు గ్రామాల్లో మామిడి, పసుపు, వరి పంటలకు నష్టం వాటిల్లింది. గొల్లపల్లె, సర్వాపూర్, కొండగట్టు తదితర ప్రాంతాల్లో మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



చెగ్యాంలో నేలవాలిన మొక్క జొన్న



బుగ్గారంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

'పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

జగిత్యాలరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలం హైదరపల్లి గ్రామంలో నష్టపోయిన పంటలను ఆమె స్థానికనాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫసల్‌భీమాయోజన పథకాన్ని సక్రమంగా అమలుచేయాలని, మండలాన్ని కేంద్రంగా కాకుండా గ్రామాన్ని కేంద్రంగా తీసుకోవాలని కోరారు. అనంతరం పర్స వెంకటికి అనే రైతుకు చెందిన గేదెపిడుగుపాటుతో మరణించగా రైతు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ప్యాక్స్‌చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మాజీసర్పంచ్ అంజన్న, నాయకులు పాల్గొన్నారు.

●సారంగాపూర్: లక్ష్మీదేవిపల్లి గ్రామంలో దెబ్బ తిన్న మామిడి తోటలను స్థానిక నాయకులతో కలిసి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత పరిశీలించారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు తేలు రాజు. మాజీ సహకార సంఘం అధ్యక్షులు సాగి సత్యంరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

గొల్లపల్లి మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదని గొల్లపెల్లి మండల బీఆర్‌ఎస్‌వి మండల శాఖ అధ్యక్షులు చందు విమర్శించారు. అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్ వెళ్తున్న తమను ముందస్తు అరెస్టులపేరుతో నిర్బంధించడం సరికాదని అన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని పరిపాలన సాగించలేరని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రెండో రోజు ప్రశాంతంగా పది పరీక్షలు

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి హిందీ పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా ముగిసింది. 67 పరీక్ష కేంద్రాల్లో 11849 విద్యార్థులకు, 11841 మంది విద్యార్థులు హాజరుకాగా, 08 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాము తెలిపారు. రెగ్యులర్ విద్యార్థుల హాజరుశాతం(99.93) సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించి 02 పరీక్ష కేంద్రాల్లో 04గురు విద్యార్థులకు గానూ 3గురు విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. కాగా పరీక్ష తీరును డీఈవో 06 సెంటర్‌లు, ప్రభుత్వ పరీక్షల జిల్లా సహాయ పరిశీలనాధికారి 6 సెంటర్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 20 సెంటర్‌లను సందర్శించారన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణ

జగిత్యాల అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భసంచి ఆపరేషన్ సందర్భంగా కొత్వాల్ అరుణ మృతి చెందిన తీరుపై శనివారం జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మృతురాలి భర్త శీలంపల్లి శ్రీనివాస్, ఆమె సోదరుడు ప్రవీణ్‌లను జగిత్యాల పట్టణంలోని మోతెవాడ పిహెచ్‌సిలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఈ నెల 13న ఉదయం ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారని, ఈ తర్వాత పేషంట్ కండీషన్ సరిగా లేదని పట్టణంలోని మరో ఆసుపత్రికి తరలించారని,అయితే అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలిస్తామని అంబులెన్స్‌ను సిద్ధం చేసుకోగా దూరం వెలితే ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని ఆపరేషన్ చేసిన వైద్యురాలి భర్త సూచించడంతో అదే ఆసుపత్రిలో ఉన్నామని తెలిపారు. అయితే కొంత సమయానికి అక్కడి వైద్యులు కరీంనగర్ తరలించాలని సూచించడంతో అక్కడికి తీసుకువెల్లామని అయితే కరీంనగర్‌లోని ఆసుపత్రిలో తన భార్య మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా మృతురాలి భర్తను, సోదరుడిని విచారించామని, తదుపరి వైద్యులను విచారించడంతో పాటు పోస్టుమార్టం నివేదికను పరిశీలించి నివేదిస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడికి ఘన సన్మానం



కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నర్సింగరావు

మెట్‌పల్లిటౌన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా నాయిని సురేష్‌గౌడ్ ఇటీవల నియామకం కాగా శనివారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన పనిని బాధ్యతతో నిర్వర్తించాలని సూచించారు. కార్యకర్తకలు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, మండలాధ్యక్షులు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు పూదరి నర్సా గౌడ్, దిలిప్ గౌడ్, రాంప్రసాద్, రాంప్రసాద్, రాహుల్ పాల్గొన్నారు.

కుమారులు పోషించడం లేదని ఆర్డీవోకు ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తమను పట్టించుకోని కుమారులపై చర్యలు తీసుకోవాలని జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్‌కు జిల్లాలోని పలువురు వృద్ధులు పిర్యాదు చేశారు. జగిత్యాల మండలం పొలాస గ్రామానికి చెందిన గుగ్గిల నర్సవ్వ, జగిత్యాల పట్టణానికి చెందిన కొప్పు భారతి, ధర్మపురి మండలం జైన గ్రామానికి చెందిన దుర్గం బాలవ్వ, సారంగపూర్ మండలం రెచపెల్లికి చెందిన సిరికొండ బుచ్చవ్వ, మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన కస్తూరి రాజం తదితరులు ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా వారి కొడుకులను, కోడళ్లను, మనుమలను, మనుమరాళ్లను, అల్లుళ్లను విచారించారు.

ఈ సందర్భంగా వృద్ధులను సంరక్షించకుంటే వృద్ధుల సంరక్షణ చట్టం 2007 నియమావళి 2011, సెక్షన్ 24 ప్రకారం శిక్షార్హులు అవుతారని జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ హెచ్చరించారు. జగిత్యాల మండలం ధర్మారం గ్రామా నికి చెందిన దండిగ లక్ష్మి, బాలమల్లు అనే వృద్ధ తల్లిదండ్రులను పోషిం చకుండా వారిని చంపుతానని బెదిరించిన వారి పెద్ద కొడుకుపై జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయిన విషయాన్ని తెలియ జేశారు. ఈ విచారణలో వృద్ధుల సంరక్షణ విభాగం అధికారి పద్మజ, ఎఫ్‌ఆర్వో కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

3,376 ఎకరాల్లో పంట నష్టం : డీఏవో

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో శుక్రవారం కురిసిన అకాల వర్షాలకు 3,376 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. జిల్లాలోని పది మండలాల్లో వరి, మొక్క.జొన్న, నువ్వులు పంటలు నష్టపోయినట్లు ఆయన తెలిపారు. వరి 1071 మంది రైతులకు చెందిన 1836 ఎకరాలు, మొక్కజొన్నకు సంబంధించి 1037 రైతులకు చెందిన 1507 ఎకరాలు, నువ్వులు 30మందికి చెందిన 33 ఎకరాలు నష్టపోయినట్లు తెలిపారు. మొత్తంగా జిల్లాలో 2138 మందికి రైతులకు చెందిన వివిధ పంటలకు సంబంధించి 3376 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని 15 మండలాల్లోని 549మందికి రైతుకు సంబంధించిన మామిడి తోటలు 862.6 ఎకరాల విస్తీర్ణంలో నష్టం వాటిల్లినట్లు జిల్లా హార్టికల్చర్ అధికారి శ్యామ్ ప్రసాద్ తెలిపారు, 33శాతం కన్నా తక్కువ స్థాయిలో పంట నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలి

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సృజనాత్మకత పెంపొందించుకోవాలని జ్యోతి ఐఐటీ అకాడమీ హైస్కూల్ డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు అన్నారు. తమ పాఠశాలలో మార్చి 21నుంచి 24వ తేదీ వరకు విద్యార్థులకు తెలంగాణ ఇన్నోవేటర్, సెన్సార్ మల్లేశం నేతృత్వంలో విద్యార్థులకు ఎల్‌ఇడీ బల్బుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హరిచరణ్ రావు మాట్లాడుతూ విద్యతో పాటు నైపుణ్యం ఉంటేనే ఈ పోటీ ప్రపంచంలో రాణించగలమన్నారు. తొలిరోజు 376మంది విద్యార్థులు స్వయంగా ఎల్‌ఇడీ బల్బులను తయారు చేశారని హరిచరణ్‌రావు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, రజితరావు, అజితరావు పాల్గొన్నారు.

ఘనంగా మడేలేశ్వరస్వామి కల్యాణం

కొడిమ్యాల, మార్చి22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెప్యాల గ్రామంలో శనివారం రజక సంఘం ఆధ్వర్యం మడలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా మడలేశ్వరస్వామిసీతలాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అంతక ముందు మహిళలు బోనాలతో వారు ఈదమ్మ దేవతకు సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు, సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

-ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రణలోకి వస్తాయని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల సాంబశివుడి ఆలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలను సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరా అనేది వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. ప్రతి ఒక్కరు భద్రతా పరంగా గ్రామాన్ని సురక్షితంగా ఉంచడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయో గపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి ఎస్ఐ ఉదయ్‌కుమార్, నేరెళ్ల సాంబశివుని ఆలయ కమిటీ చైర్మన్ జాజాల రవీందర్, మాజీ సర్పంచ్ పలిగిరి సత్యం, మాజీ ఎంపీటీసీ రెడ్డవేని సత్యం పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

ఇబ్రహీంపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీత, జిల్లా రిసోర్స్ పర్సన్ కడకుంట్ల అభయ్ రాజ్ విద్యార్థులకు సైన్స్ పట్ల శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకల నిర్మూలన గురించి వివరించారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

కథలాపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తహసీల్దార్ వినోద్, కోరుట్ల సీఐ సురేశ్ పేర్కొన్నారు శనివారం మండల కేంద్రంలో కళాధార పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సైబర్ నేరాలు, గంజాయి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గడ్డం భూమారెడ్డి, ఎస్సై నవీన్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణ రెడ్డి, మాజీ జడ్‌పీటీసీ నాగం భూమయ్య, ప్రిన్సిపాల్ కమలాకర్, ఏఓ యోగిత, డైరెక్టర్ దివాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పులి శిరీషహరిప్రసాద్, మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయాన్ని పచ్చని మామిడి తోరణాలు, రంగుల పూలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ఆలయ ప్రధాన అర్చకుడు చేపట్టారు. అనంతరం వేదపండితులు వేదమంత్రోత్సవాల మధ్య స్వామి కల్యాణం వైభవంగా జరిపారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాన్ని నిర్వహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈర రమేష్, ఈర రవీందర్, ఈర గంగాధర్, వీర గంగనర్సయ్య, హన్‌మాన్ దీక్షపరులు, నాయకులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

మెట్‌పల్లిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) :నీటిన వృధా చేయకుండా వాడుకోవాలని మ్యారేజ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ (సైకాలజిస్ట్) భూమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కాలేజ్‌లో నెహ్రూ యువ కేంద్రంలో జగిత్యాల ఆధ్వర్యంలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు లేనిది ప్రపంచం లేదాని నీటి యొక్క విలువను విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా వాడుకోవాలని కోరారు. నీటి యొక్క ప్రముఖ్యతపై విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్, వాలంటీరిలు గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు

ధర్మపురి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుండి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. భక్తులు వివిధ రకాల పూజల కోసం టిక్కెట్లు కొనుగోలు చేశారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నంబి నరసింహ మూర్తి నిత్య పూజలు నిర్వహించారు.

'రైతుల ఆర్థిక అభివృద్ధికి రుణాలు'

కొడిమ్యాల, మార్చి22(ఆంధ్రజ్యోతి) : రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రాథమిక సహకార సంఘం నుండి రుణాలను మంజూరు చేశామని కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఇంగిల్ విండో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ రైతులు తీసుకున్న పంట రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితె సంఘం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతర రైతులకు పంట రుణాలను ఇవ్వటానికి అవకాశం ఉంటుందన్నారు. సింగిల్ విండో పరిదిలోని 501 మంది రైతులకు 3కోట్ల 92లక్షల79861 రూపాయలు రుణమాఫీ జరిగిందన్నారు. ఇప్పటి వరకు సంఘం నుంచి 676మంది రైతులకు 6కోట్ల 66 లక్షల 88823 రూపాయల క్రాప్ లోన్లు ఇచ్చామన్నారు. 207 మంది రైతులకు 9 కోట్ల 93 లక్షల 88695 రూపాల దీర్ఘకాలిక రుణాలను అందించామన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో పర్సన్ ఇన్‌చార్జులు, కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశానికి తరలిరావాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

మల్యాల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశంకు మండలం నుంచి ముఖ్య కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. మల్యాలలో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్న ఈ సమావేశం వీకన్వేన్షన్‌లో జరుగుతుందని అన్నారు. అనంతరం మండలంలోని పోతారం, రాజారంకు చెందిన నిమ్మ మల్లయ్య, లక్ష్మిరాజం, వెంకటి ఇటీవల మృతిచెందగా మృతుల కుటుంబసభ్యులను రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్లు సాగర్‌రావు, మధుసూధన్ రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు బద్దం తిరుపతిరెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

జగిత్యాలరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని జగిత్యాల రూరల్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పొలాస సెక్టార్‌లో గల లక్ష్మీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం సీమంతాలు, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్లు సునీత, జలజ, తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభను విజయవంతం చేయండి

ఎండపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణను ఆమోదపరిచినందుకు గాను మండలంలోని రాజారాంపల్లి గ్రామంలో ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే కృతజ్ఞత సభను విజయవంతం చేయాని మండల అధ్యక్షులు శైలెందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరావాలి

జగిత్యాల అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 25న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు పులి మల్లేశం, గుడిసె దేవయ్య, కనికరపు సత్తయ్య, సురుగు రాజయ్య పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుపై అవగాహన

రాయికల్, మార్చి, 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామోజీపేటలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో లోహియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సహకారంతో ఆయిల్ ఫాం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో ముత్తీశ్వర్ మాట్లాడుతూ రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో పద్మావతి, లోహియో కంపెనీ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ రాజేష్, మాజీ ప్రజాప్రతినిధి మహేష్ పాల్గొన్నారు.